క్లుప్తంగా

ఓంశక్తి ఆలయంలో పూజలు



పుంగనూరు: పట్టణంలో రాగానిపల్లె రోడ్డులోని శ్రీఓంశక్తి అమ్మవారి ఆలయంలో సోమవారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, కార్తీక సోమవార పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి కలశాలు ఏర్పాటు చేసి, నేతిదీపాలు వెలిగించారు. మొక్కులు చెల్లించారు. నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

గోపిశెట్టిపల్లె రైతుల నిరసన



ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గోపిశెట్టిపల్లె రైతులు

పలమనేరు: పుంగనూరు మండలం గోపిశెట్టిపల్లెకు చెందిన పలువురు రైతులు స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ, తమ గ్రామంలో తాతముత్తాల కాలం నుంచి ఉన్న భూములను పరిశ్రమ నిర్మాణం పేరిట సేకరిస్తున్నట్టు పత్రికా ప్రకటనల్లో చూశామన్నారు. ఇంతవరకు తమను ఏ శాఖ అధికారులు సంప్రదించలేదని, భూ సేకరణకు తాము సముఖంగా లేమన్నారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం ఇచ్చారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం




సాంబశివారెడ్డి, శివకుమార్

శాంతిపురం: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) మండల శాఖ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఫెడరేషన్ సీనియర్ నాయకుడు నాగరాజు తెలిపారు. స్థానిక ఓ కల్యాణ మండపంలో నిర్వహించిన సర్వ సభ్య సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు చెప్పారు. అధ్యక్షుడిగా ఎం.సాంబశివారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శివకుమార్, గౌరవాధ్యక్షుడిగా ఎస్. ధనంజయ, అసోసియేట్ అధ్యక్షులుగా బి కరుణాకర్, ఎం ధనలక్ష్మి, కోశాధికారిగా పి.చైతన్యతో పాటు 20 మందిని ఎన్నుకున్నామన్నారు.

స్రవంతికి డాక్టరేట్



రొంపిచెర్ల: స్థానిక ముత్యాలమ్మవీధికి చెందిన స్రవంతికి తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. పలమనేరు మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఆమె మ్యాథమేటిక్స్ లెక్చరర్‌గా పని చేస్తున్నారు. మహిళా వర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.శివ పార్వతి పర్యవేక్షణలో 'ఏ స్టడీ ఆన్ సెండామినేషన్ పారామీటర్స్ అండ్ టోపోలాజికల్ ఇండిసెస్ ఆఫ్ గ్రాఫ్ అండ్ మాలిక్యులర్స్ గ్రాఫ్' అనే అంశంపై సమర్పించిన సిద్ధాంత వ్యాసానికి డాక్టరేట్ ఇచ్చారని ఆమె తెలిపారు.

న్యాయవాదుల ర్యాలీ



ర్యాలీ చేస్తున్న న్యాయవాదులు

పుంగనూరు: నూతన రెవెన్యూ టైటిల్ మార్పిడి చట్టం 27ను రద్దు చేయాలని కోరుతూ న్యాయవాదులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు గల్లాశివశంకర్‌నాయుడు, కార్యదర్శి ఆనందకుమార్ మాట్లాడారు. రెవెన్యూ చట్టాన్ని రద్దు చేయాలని, టైటిల్ నిర్ణయించే అధికారం కోర్టుల నుంచి తప్పించి, ట్రిబ్యునల్‌కు ఇవ్వడంతో ప్రజలకు అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ర్యాలీలో న్యాయవాదులు వెంకట్రామయ్యశెట్టి, విజయకుమార్, బాలాజికుమార్, వెంకటముని యాదవ్, వీరమోహన్‌రెడ్డి, వినోద్‌కుమార్, పులి రామకృష్ణారెడ్డి, వెంకట్రమణారెడ్డి, ప్రసాద్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఈరోజు

మున్సిపాలిటీలో ఎమ్మెల్యే పర్యటన

పలమనేరు: పలమనేరు మున్సిపాలిటీలోని 12వ వార్డు టీఎస్ అగ్రహారం సచివాలయ పరిధిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వెంకటేగౌడ నిర్వహించనున్నట్టు స్థానిక ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం గంటావూరు సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలోనూ ఆయన పాల్గొంటారని, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

బూరగమందలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

సదుం: మండలంలోని బూరగమంద సచివాలయంలో మంగళవారం మధ్యాహ్నం 2.30గంటలకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. బూరగమంద, చీకలచేను పంచాయతీల ప్రజలు హాజరు కావాలని కోరారు.

టీడీపీకి చరమగీతం పాడుదాం

- 'వై ఏపీ నీడ్స్ జగన్'లో ఎమ్మెల్సీ భరత్ పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: తెలుగుదేశం పార్టీకి ప్రజలు చరమగీతం పాడాలని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ పిలుపునిచ్చారు. మండలంలోని ఉన్సిగానిపల్లె పంచాయతీ ఆనిగానూరులో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం ఆయన నిర్వహించారు. ఆనిగానూరు, జంపూరులో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో భరత్ మాట్లాడారు. కుప్పంలో 30 ఏళ్ల నుంచి టీడీపీకి ఓట్లువేసిన ప్రజలను చంద్రబాబునాయుడు మోసం చేస్తూనే ఉన్నారన్నారు. ఎన్నికల సమయంలో కుప్పం ప్రజలపై ఎనలేని ప్రేమ నటించి, ఆ తర్వాత ప్రజా సమస్యలను గాలికి వదిలేయడమే కాకుండా ప్రజలకు ముఖం చాటేసిన నాయకుడు చంద్రబాబు మాత్రమేనని దుయ్యబట్టారు. కరోనా విపత్తులో కుప్పంవైపు కన్నెత్తి చూడని చంద్ర బాబును శాశ్వతంగా కుప్పం నుంచి తరిమికొట్టాలన్నారు. కుప్పం అభివృద్ధి వైఎస్సార్ సీపీతోనే సాధ్యమని స్పష్టం చేశారు. నిత్యం ప్రజల్లో ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న తనను ఈసారి ఎన్నికల్లో ప్రజలు ఆదరించి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కొనసాగింపునకు ప్రజలు మరోసారి రాష్ట్రంలో వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని కోరారు. ఆనిగానూరు ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం సరఫరా చేసిన వంటపాత్రలను నిర్వాహకులకు పంపిణీ చేశారు. అనంతరం మునీశ్వరుడి ఆలయంలో నిర్వహించిన కుంభాభిషేకం కార్యక్రమంలో భరత్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, స్థానిక సర్పంచ్ నేత్రావతి, రెస్కో డైరెక్టర్ నాగిరెడ్డి, నేతలు గుర్రప్ప, పీఏ మురుగేష్, బోర్‌వెల్ చెంగారెడ్డి పాల్గొన్నారు.

నేడు గడపగడపకు మన ప్రభుత్వం

మండలంలోని గౌరివిమాకులపల్లె పంచాయతీలో మంగళవారం ఉదయం 7 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ నిర్వహిస్తారని ఎంపీడీఓ రాధాకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నేతలు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

కావేటిగారిపల్లెలో 'వికసిత్ భారత్'



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని కావేటిగారిపల్లె పంచాయతీలో సోమవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17 సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించారు. ఈ పథకాలన్నీ గ్రామీణ ప్రాంతాల్లోని అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఉజ్వల యోజన పథకం కింద మంజూరైన గ్యాస్ సిలిండర్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, ఎంపీడీఓ రాజశేఖర్, ఎంపీటీసీ గీతాంజలి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గడ్డి కత్తిరింపు యంత్రాల పంపిణీ



గడ్డి కత్తిరింపు యంత్రాలను పంపిణీ చేస్తున్న జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి

పెద్దపంజాణి: రాజుపల్లె సచివాలయ పరిధిలోని పది మంది పాడి రైతులకు సబ్సిడీపై గడ్డి కత్తిరింపు యంత్రాలను సోమవారం అధికారులతో కలసి వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ, పాడి రైతుల కోసం ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి సుధానిధి, సిబ్బంది సరిత, శంకర్, మహేష్, రైతులు పాల్గొన్నారు.

దీపస్తంభ ప్రతిష్ఠాపన



పుష్పపల్లకిపై ఊరేగుతున్న అయ్యప్పస్వామి

వి.కోట: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం దీప స్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆదివారం సాయంత్రం నుంచే ప్రత్యేక పూజలు హోమాలు, యాగాలు ప్రారంభించారు. సోమవారం ఉదయం దీప స్తంభ ప్రతిష్ఠాపన అనంతరం యాగశాల ప్రవేశం, వేదపారాయణం, కుంభారాధన తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం అయ్యప్పస్వామి ఉత్సవమూర్తులను పుష్పపల్లకిపై కొలువుదీర్చి భక్తుల నామస్మరణ, మంగళ వాయిద్యాల హోరు నడుమ పురవీధుల్లో ఊరేగించారు. ఆలయం వద్ద అన్నదానం చేశారు.

కులగణన దేశవ్యాప్తంగా చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న అతిక్‌బాషా తదితరులు

పుంగనూరు: వెనుకబడిన ప్రజల అభ్యున్నతికి దేశవ్యాప్తంగా కులగణన చేయవలసిన అవసరం ఉందని ఎస్‌డీపీఐ పార్టీ నేతలు జమీర్, యూసుఫ్, అతిక్‌బాషా డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో వివిధ సంఘాలతో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ సీతారామన్‌కు వినతిపత్రం ఇచ్చారు. అతిక్‌బాషా మాట్లాడుతూ, కులగణనతో అణగారిన వర్గాలను గుర్తించడానికి వీలుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిద్ధిక్, మహబూబ్‌బాషా, షా ముబారక్, యూసఫ్, ఏజియాస్, సోహెబ్, వశీం, ఖాదర్, సద్దాం, ముస్తఫా, సైపుల్లా, ఇర్ఫాన్, మాలిక్, తనీర్, నౌజవాన్ కమిటీ అధ్యక్షుడు అయూబ్, సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకోనేటిరాయునికి ఉయ్యాలసేవ



ఆలయంలో నిర్వహిస్తున్న ఉయ్యాల సేవ

గంగవరం: కార్తీకపౌర్ణమి సందర్భంగా మండలంలో టీటీడీ అనుబంధ కీలపట్ల శ్రీ కోనేటిరాయ స్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం స్వామివారికి ఉయ్యాలసేవను వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత స్వామివారిని ఉయ్యాలపై కొలువు దీర్చి మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చరణల నడుమ ఈ కార్యక్రమాన్ని వేద పండితులు నిర్వహించారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ ట్రస్ట్ కళాకారులు అన్నమాచార్య సంకీర్తనలు ఆలపించారు. అనంతరం గ్రామ వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు గజేంద్ర, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవన పనుల పరిశీలన

బైరెడ్డిపల్లె: స్థానిక ఎస్సీ కాలనీలో ఎంపీ నిధులు రూ.10 లక్షలతో నిర్మిస్తున్న కమ్యూనిటీ భవన నిర్మాణ పనులను సోమవారం ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప పరిశీలించారు. కార్య క్రమంలో సర్పంచ్ వెంకటేష్ పాల్గొన్నారు.

జగనన్నకు రుణపడి ఉంటాం

- ఘనంగా ఏపీ సచివాలయాల ఉద్యోగుల సంఘ వార్షికోత్సవం



సంబరాలు నిర్వహిస్తున్న ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘ నాయకులు

పలమనేరు: సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో నిరుద్యోగుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మురళీనాథ్, రామరాజు తెలిపారు. సంఘ తొలి వార్షికోత్సవాన్ని మండలంలోని సముద్రపల్లె సచివాలయం వద్ద సోమవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. వారు మాట్లాడుతూ, తమ సమస్యలను ప్రభుత్వం ఇప్పటికే చాలావరకు పరిష్కరించిందన్నారు. కార్యక్రమంలో మండల సంఘ నేతలు ప్రకాష్, కిశోర్, సాయి బంగారం, కార్తీక్ పాల్గొన్నారు.

కార్తీకం.. పరమ పవిత్రం




సదుం: ప్రత్యేకాలంకారంలో మరకతేశ్వరస్వామి

చౌడేపల్లె: మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో..



రొంపిచెర్ల కట్ట కింద శివాలయంలో నోము పూజలు చేస్తున్న మహిళలు

చౌడేపల్లె: కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని స్థానిక శ్రీ అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు రాజశేఖర దీక్షితులు, కుమారస్వామి, మహేష్ ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవమూర్తుల తోపాటు శివలింగానికి ప్రత్యేక పూజలు చేసి సుందరంగా ముస్తాబు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన మహిళలు కార్తీక దీపారాధన, ఆలయంలో ప్రదక్షిణలు చేశారు.

సదుంలో..

సదుం: మండలంలోని శివాలయాలు సోమవారం భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక మరకతేశ్వరస్వామి, అరుణాచలేశ్వరస్వామి, వీర భద్రస్వామి ఆలయాలను భక్తులు దర్శించుకున్నారు. నడిగడ్డ మల్లేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. కేదారేశ్వరస్వామి వ్రతమాచరించారు. భక్తులకు అర్చకులు వ్రత విశిష్టతను తెలిపారు.

భక్తిప్రపత్తులతో కేదారేశ్వర నోములు

రొంపిచెర్ల: రొంపిచెర్ల సమీపంలోని కట్ట కింద శివాలయంలో కేదారేశ్వర నోముల పండుగను భక్తులు సోమవారం ఘనంగా నిర్వహించారు. చంద్రుడు కృత్తిక నక్షత్రంతో కలసి ఉన్న రోజు కార్తీక పౌర్ణమి వస్తుందని ఈ పర్వ దినాన నోములు నోయడం పరిపాటి. వందలాది మంది మహిళలు ఉపవాస దీక్షలతో నోములను నోచారు. ఆలయ పూజారి కేదారేశ్వర కథ చదివి వినిపించారు. అనంతరం టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించారు.

కార్తీక దామోదర హోమం

బైరెడ్డిపల్లె: స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో సోమవారం భక్తిప్రపత్తులతో కార్తీక దామోదర హోమం చేశారు. ఉదయం మహా గణపతి పూజ, కార్తీక దామోదర పూజ, హోమం, శాంతి హోమం, పూర్ణాహుతి, యజ్ఞ రక్షా వినియోగం తదితర కార్యక్రమాలను శాస్త్రబద్ధంగా నిర్వహించారు. సాయంత్రం కార్తీక దీపాలను వెలిగించారు.

వి.కోటలో..

వి.కోట: కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని స్థానిక ఈశ్వర్‌నగర్‌లోని శ్రీ కాశీవిశ్వేరస్వామి ఆలయం, దాసార్లపల్లెలోని శ్రీ కాశీవిశేశ్వరస్వామి ఆలయాల్లో ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పిండిదీపాలను వెలిగించారు. మొక్కులు చెల్లించారు.

రామకుప్పంలో..

రామకుప్పం: కార్తీకమాసం సందర్భంగా స్థానిక శ్రీఅన్నపూర్ణాంబ సమేత శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో కార్తీక సోమవార ప్రత్యేక పూజలు, ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. దీపాల వెలుగుల్లో ముక్కంటి భక్తులకు దర్శనం కల్పించారు.





బైరెడ్డిపల్లె : హోమం చేస్తున్న వేదపండితులు, భక్తులు, వి.కోట : దీపాలు వెలిగిస్తున్న మహిళా భక్తులు, రామకుప్పం : ఆలయంలో వెలిగించిన దీపాలు

'వైఎస్సార్ షాదీ తోఫా' పంపిణీ



వైఎస్సార్ షాదీతోఫా లబ్ధిదారురాలి కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: పట్టణంలోని జెండామాతానికి చెందిన ముంతాజ్ బేగంకు వైఎస్సార్ షాదీతోఫా(దుల్హాన్) పథకం కింద రూ.లక్ష అందజేసినట్టు స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. పేద మైనారిటీల కుటుంబాల్లో పెళ్లి గౌరవంగా జరగాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. గత టీడీపీ పాలనలో రూ.50 వేలు మాత్రమే ఇచ్చేవారని, తమ ప్రభుత్వం రూ.లక్ష ఇస్తోందని, దీనిని ముస్లింలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముంతాజ్ కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ హైదర్ పాల్గొన్నారు.

సాయినాథుని సేవలో ఎమ్మెల్యే వెంకటేగౌడ



బాబా పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే

గంగవరం: మండలంలో సాయినగర్‌లోని శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో కార్తీక పౌర్ణమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు సాయినాథునికి ఉదయం నుంచి అభిషేక, పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో బాబాని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్తీక పౌర్ణమి వేడుకల్లో ఎమ్మెల్యే వెంకటేగౌడ నాయకులతో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, నాయకులు చంద్రప్ప, శ్రీరాములురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్తీకపౌర్ణమి పూజల్లో ఎమ్మెల్యే

పలమనేరు: స్థానిక కాశీవిశ్వేశ్వరాలయంలో సోమవారం నిర్వహించిన కార్తీక పౌర్ణమి ప్రత్యేక పూజల్లో స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికి ప్రసాదాలను అందజేశారు. ఆయన వెంట ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి, పట్టణ మాజీ కన్వీనర్ మండీసుధా, ఆలయ చైర్మన్ వీరభద్ర పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎంపీపీ

రొంపిచెర్ల: ముఖ్యమంత్రి సహాయనిధి ఫండ్ చెక్కులను బాధితులకు ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి సోమవారం పంపిణీ చేశారు. బోడిపాటివారిపల్లె గ్రామ పంచాయతీలోని కెఎస్. కురవపల్లెకు చెందిన వివాహిత దివ్య వేలూరు సీఎంసీలో నాలుగేళ్ల క్రితం ఆపరేషన్ చేసుకుంది. ఈ క్రమంలో ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కోరింది. అలాగే మోటుమల్లెల గ్రామ పంచాయతీలోని చిన్న పాపిరెడ్డిగారిపల్లెకు చెందిన శివ ప్రసాద్‌రెడ్డి అనారోగ్యంతో బాధ పడుతూ చికిత్స పొందాడు. దీంతో మంత్రి దివ్యకు రూ.56 వేలు, శివప్రసాద్ రెడ్డికి రూ.30 వేలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంజూరు చేయించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఇబ్రహీంఖాన్, వైస్ ఎంపీపీ విజయశేఖర్, సర్పంచులు నాగిరెడ్డి, జీవలత, నాయకులు సురేంద్రనాయుడు, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న ఎంపీపీ సుబ్రమణ్యం

రామకుప్పం: మండలంలోని 89 పెద్దూరు పంచాయతీ ఆరిమానుపెంటకు చెందిన గౌరమ్మ సోమవారం మృతి చెందింది. ఇది తెలుసుకున్న ఎమ్మెల్సీ భరత్ స్థానిక నేతల ద్వారా మృతురాలి కుటుంబానికి రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సుబ్రమణ్యం, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, స్థానిక సర్పంచ్ మల్లిక, ఎంపీటీసీ వెంకటరమణ, నేతలు గజేంద్ర, గోవిందప్ప, జయరాం పాల్గొన్నారు.

ఎన్నికల విధులకు సన్నద్ధులుకండి



మాట్లాడుతున్న అసిస్టెంట్ ఎలెక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ కిరణ్‌కుమార్

పలమనేరు: 2024 సాధారణ ఎన్నికలకు సెక్టార్ అధికారులు సన్నద్ధంగా ఉండాలని పలమనేరు మున్సిపల్ కమిషనర్, అసిస్టెంట్ ఎలెక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ కిరణ్‌కుమార్ ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆయన సెక్టోరల్ అధికారులకు సమావేశం నిర్వహించారు. ఎన్నికలకు సంబంధించిన విధులు, బాధ్యతలను ఆయన తెలియజేశారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడగానే కోడ్‌ను పటిష్టంగా అమలు చేయాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో సెక్టోరల్ అధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



పాతపేటలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

బైరెడ్డిపల్లె: మండలంలోని పాతపేట, రామసముద్రం గ్రామాల్లో సోమవారం వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారరథంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయుష్మాన్ భారత్, దీనదయాళ్, అంత్యోదయ యోజన, పీఎం ఆవాస్ యోజన, పీఎం ఉజ్వల్ యోజన, జలజీవన మిషన్, జీవన జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, సురక్ష బీమా యోజన తదితర 17 పథకాలపై డిజిటల్ స్క్రీన్‌లో వీడియోలను ప్రదర్శించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కుమారస్వామి, ఎంపీడీఓ రాజేంద్రబాలాజి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన



పుంగనూరు: పట్టణంలోని లయన్స్‌క్లబ్ సోమవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి మంచి స్పందన లభించింది. క్లబ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ శివ, అధ్యక్షుడు త్రిమూర్తిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 72 మంది రక్తదానం చేసేందుకు హాజరయ్యారు. వీరిని పరీక్షించి 42 మంది రక్తాన్ని వైద్యులు రెడ్డికార్తీక్ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది సేకరించారు. దాతలకు సర్టిఫికెట్లను, అల్పాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘ అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం, రెడ్డి జన సంఘ నాయకుడు మహిపాల్‌రెడ్డి, క్లబ్ సభ్యులు మహేంద్రరావు, పీఎల్.శ్రీధర్, రఘునాథరెడ్డి, రజ్వి, సుధాకర్‌రావు, సురేష్ పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'కు పేర్లు నమోదు చేసుకోవాలి

పెద్దపంజాణి: 'ఆడుదాం ఆంధ్ర' పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు డిసెంబర్ 10వ తేదీ లోపు వారి పరిధిలోని సచివాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ అబ్దుల్ రహీం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 ఏళ్లు నిండిన వారు వారు మాత్రమే ఈ పోటీలలో పాల్గొనేందుకు అర్హులన్నారు. సచివాలయ పరిధిలో క్రికెట్, ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు డిసెంబర్ 15 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు తెలియజేశారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: 'ఆడుదాం ఆంధ్ర' పోటీల్లో పాల్గొనే 15 ఏళ్ల పైబడిన పురుషులు, స్త్రీలు తమ పేర్లను గ్రామసచివాలయంలోగానీ లేదా 1902 కు కాల్ చేసి నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ సుధాకర్ విలేకరులకు తెలిపారు. వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, ఖో-ఖో, బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీలు నిర్వహిస్తామన్నారు. డిసెంబర్ 13వ తేదీ వరకు పేర్లను నమోదు చేసుకోవచ్చని, ఆ తర్వాత డిసెంబర్ 15నుంచి ఫిబ్రవరి 3 వరకు క్రీడా పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువతీ యువకులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.